




www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక


AKSHITHA NATIONAL DAILY

# తెలంగాణ దిక్సూచి

శనివారం | 06 | డిసెంబర్ | 2025 | పేజీలు: 08

## పేదల బియ్యం
# పక్కదారి

### పిడిఎస్ బియ్యం మాఫియా " గుట్టురట్టు"








**ఎంఎల్ఎస్ పాయింట్‌లో నకిలీ ఎంట్రీలు**

**డీలర్ సంతకం బియ్యం మాత్రం మాయం !**

**సివిల్ సప్లైస్ విజిలెన్స్ దాడులు**

**జిల్లాలో పెద్ద స్కాం బయటకు**

**అక్రమ రవాణాపై ప్రత్యేక ఆపరేషన్**

**అదనపు కలెక్టర్ వివరాలు**

**భద్రాద్రి కొత్తగూడెం, అక్షిత ప్రతినిధి:** జిల్లాలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై చేపట్టిన ప్రత్యేక కార్యాచరణలో పెద్ద ఎత్తున జరిగిన మోసపూరిత లావాదేవీలు బయటపడినట్లు జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన పాత్రికేయుల సమావేశంలో ఆపరేషన్‌కు సంబంధించిన కీలక అంశాలను వెల్లడించారు. అధికారుల సమాచారం మేరకు, డిసెంబర్ 2న సాయంత్రం పాల్వంచ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద విజిలెన్స్ టాస్క్ ఫోర్స్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ సంయుక్త దళాలు నిఘా ఏర్పాటు చేశాయి. ఈ సమయంలో బజాజ్ పల్సర్‌పై స్టాక్ పాయింట్‌లోకి ప్రవేశించిన యువకుడు పత్రాలను ఇన్‌చార్జ్ సత్యవతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ కృష్ణకుమార్‌కి అందజేయడం అధికారులకు అనుమానం కలిగించింది. గేటు వద్ద ఆపి విచారణ చేయగా, అతడు ప్రసాంత్‌గా గుర్తించారు. ఆయన స్టేజ్ – కాంట్రాక్టర్ ఎన్. శ్రీనివాస్‌కు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. విచారణలో ప్రసాంత్ కీలక వివరాలు వెల్లడించాడు. వ్యవసాయ మార్కెట్ కమిటీ, మల్లారం గోదామ్ నుండి సరఫరా కావాల్సిన పిడిఎస్ సన్న బియ్యాన్ని, జిపిఎస్ ట్రాకింగ్ వ్యవస్థలో చేర్పులు చేసి ఎస్29టి 5139 లారీకి చెందిన ట్రక్ చిట్ నంబర్ 4346తో నకిలీ ..మిగతా 2లో

---

## పక్కాగా పోలింగ్
# మెటీరియల్ పంపిణి

### రాజాపూర్ జడ్ పి పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాట్ల పరిశీలన

### కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి :** మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా శుక్రవారం రాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. జడ్ పి ఉన్నత పాఠశాలలో పోలింగ్ మెటీరియల్ ..మిగతా 2లో

---

# ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** ఈవియం గోదాముకు భద్రత విషయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. వనపర్తి మండల తహసిల్దార్ కార్యాలయం వెనుకభాగంలో ఉన్న ఈవియం గోదాం ..మిగతా 2లో

---

# త్రివిధ దళాలకు బాసటగా నిలవాలి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి




**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ :** దేశ రక్షణకు ప్రాణాలను ఫణంగా పెట్టి అహర్నిశలు కృషి చేస్తున్న త్రివిధ దళాలకు ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.ఈనెల 7న నిర్వహించనున్న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ..మిగతా 2లో

---

## చుక్క నీరు నిల్వకుండా
# ప్రత్యేక కార్యాచరణ

### రూ.4.26 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**హనుమకొండ, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని 54, 6వ డివిజన్ లలో రూ.4.26 కోట్లతో మంచి నీటీ పైప్ లైన్ ..మిగతా 2లో

## పక్కాగా పోలింగ్ మెటీరియల్ పంపిణి



మొదటి పేజీ తరువాయి...

పంపిణీకి ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో చర్చించి కలెక్టర్ సూచనలు చేశారు.జడ్ పి ఉన్నత పాఠశాలలో పోలింగ్ మెటీరియల్ పంపిణీకి ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.పోలింగ్ సిబ్బంది సంఖ్యకు సరిపడా బస్సులు ఏర్పాటు చేయాలని, వారికి భోజన సదుపాయం,పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఎంపిడిఓకు ఆమె సూచించారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు అవసరమైన పోలింగ్ సామాగ్రి పంపిణీ సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ గురించి చర్చించారు. ఎన్నికల విధులలో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ పంపిణీ చేసి వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. మండలంలో ఓపిఓల మరోసారి శిక్షణ నివ్వాలని అన్నారు. గ్రామాలలో ఎఫ్ఎస్ టి బృందాలు మోడల్ కోడ్ అమలు పర్యవేక్షణ నిర్వహించాలని తహశీల్దార్ కు సూచించారు.

## ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత



మొదటి పేజీ తరువాయి...

త్రైమాసిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్యా నాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో ఈవియంల భద్రతను పరిశీలించారు. ఆజ్ఞాపక యంత్రాలు, సి.సి. టివి లతో ఉన్న భద్రతను పరిశీలించారు. పోలీస్ బందోబస్తు ఎలా ఉంది, విధుల నిర్వహణ పై అడిగి తెలుసుకున్నారు. ఈ.వి.యం. ల భద్రత పై ఎప్పటికప్పుడు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్యా నాయక్, ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసిల్దార్ రమేష్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బిజెపి నుంచి పెద్దిరాజు, టిడిపి నుంచి కొత్తపల్లి శంకర్, బీఎస్పీ కుమార స్వామి, కాంగ్రెస్ నుండి ఎన్ త్రినాథ్, సిపిఎం పరమేశ్వర చారి, టిఆర్ఎస్ జమీల్ తదితరులు పాల్గొన్నారు.

## త్రివిధ దళాలకు బాసటగా నిలవాలి



మొదటి పేజీ తరువాయి...

శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆమె త్రివిధ దళాలకు బాసటగా డొనేషన్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్రివిధ దళాలు ఎల్లా వేళలా దేశాన్ని సంరక్షిస్తున్నందునే అందరూ ప్రశాంతంగా బ్రతుక గలుగుతున్నామని, అలాంటి సైనికులకు సహకారం అందించడంలో ప్రతి ఒక్కరు బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. త్రివిధ దళాల సైనికులకు బాసటగా నిలిచేందుకు ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవంగా నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి టి.వనజ, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, మాజీ సైనికుల సంక్షేమ అసోసియేషన్ అధ్యక్షులు కే. భాస్కర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ రాజు, సభ్యులు శ్రీనయ్య ,రాములు తదితరులు ఉన్నారు. ముందుగా ఎన్ సి సి క్యాడేట్లు, స్కౌట్ గైడ్స్ క్యాడెట్లు జిల్లా కలెక్టర్ కు డ్రమ్స్ తో స్వాగతం పలికారు.

అనంతరం జిల్లా కలెక్టర్ కు సాయుధ దళాల దినోత్సవ సూచికగా బ్యాడ్జిని అలంకరించగా, జిల్లా కలెక్టర్ సాయిదలాల సహకారార్థం నిధులను డొనేట్ చేశారు.

# పేదల బియ్యం
# పక్కదారి




మొదటి పేజీ తరువాయి...

ఎంట్రీలు సృష్టించి తిరిగి పంపినట్లు నిర్ధారణ అయింది. అసలు లారీలో ఉన్న 600 సంచుల (300 క్వింటాళ్ల) బియ్యం నల్లబజారుకు మళ్లించబడినట్లు తేలింది.

తదుపరి దర్యాప్తులో స్టేజ్ – %×% కాంట్రాక్టర్ శ్రీనివాస్, తన భార్య పేరుతో కాంట్రాక్టర్‌గా పనిచేస్తూ మణుగూరులోని రమ్యా రైస్ ట్రేడర్స్ మిల్లర్ నరహరితో కలిసి పిడిఎస్ బియ్యం మళ్లింపులో నేరుగా ప్రమేయం ఉన్నట్లు ఒప్పుకున్నాడు. ప్రతి లారీకి రూ.50 వేల చొప్పున ఐదు సార్లు బియ్యం తరలించినట్లు వెల్లడించాడు. నగిరిపేట ప్రాంతంలో గుర్తించిన టి ఎస్29టి 5139 లారీ డ్రైవర్ అనిల్‌కుమార్ కూడా మిల్లర్ సూచనల మేరకు లారీ నిలిపివేశానని అంగీకరించాడు. అధికారులు లారీని స్వాధీనం చేసుకుని పిడిఎస్ బియ్యం పంచుల సమక్షంలో రికవరీ చేశారు. ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్ సత్యవతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ కృష్ణకుమార్ కూడా విచారణలో నకిలీ ఎంట్రీలు చేయడం, హమాలి నాగరాజు సహకారం, ఫేర్‌ప్రైస్ షాప్ డీలర్ల



ఒత్తిడి, లారీలకు నకిలీ రసీదుల కోసం లంచాలు స్వీకరించిన విషయాలను అంగీకరించినట్లు అధికారులు వెల్లడించారు. డీలర్లు బయోమెట్రిక్ సంతకాలు చేసినప్పటికీ అసలైన బియ్యం అందలేదని విచారణలో స్పష్టమైంది.అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ .."ఈ వ్యవహారంలో ఒక వ్యవస్థీకృత మాఫియా రింగ్ పనిచేసినట్లు స్పష్టమైంది. ప్రభుత్వానికి, ప్రజలకు భారీ నష్టం జరిగింది. క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్, మోసం, కుట్రతో పాటు ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్, పిడిఎస్ నియంత్రణ ఆర్డర్ ఉల్లంఘనలు జరిగినట్లు నిర్ధారణ



అయింది. నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులకు ఫిర్యాదు చేశాము" అని తెలిపారు. ఈ సమావేశంలో డిసిఓ ప్రేమ్‌కుమార్, పౌర సరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, ఓఎస్‌డీ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# చుక్క నీరు నిల్వకుండా
# ప్రత్యేక కార్యాచరణ

మొదటి పేజీ తరువాయి...


సీసీ డ్రైన్, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఒకే రోజు సుమారుగా 4 కోట్లపై చిలుకు నిధులతో ఆయా డివిజన్ లలో పనులు చేపట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆయా డివిజన్ లో పలు కాలనీలో నేరుగా పర్యటిస్తూ పలు సమస్యలు నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. 54,64 డివిజన్ లలో సొంత డివిజన్లు అని రెండు డివిజన్ లలో ప్రత్యేక దృష్టితో నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులను చేస్తున్నామని తెలిపారు. రానున్న అతికొద్ది రోజుల్లోనే రూ.1000 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించనున్నారని తెలిపారు. ఆనాడు పీసీసీ హోదాలో హనుమకొండ



నగరానికి వచ్చిన రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలలో అన్నింటినీ నెరవేర్చే దిశగా పనులు చేపట్టారని అన్నారు. పోచమ్మకుంట శ్మశాన వాటిక మౌలిక సదుపాయాలు అభివృద్ధి కొరకు ప్రత్యేక దృష్టితో కిరాయి ఇండ్లల్లో ఉన్న కుటుంబాలకు మరణం భారం కాకూడదని ప్రత్యేక గదులను ఏర్పాటుచేయడం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు .ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,కాలనీ ప్రజలు మరియు అధికారులు పాల్గొన్నారు.

# కొంపల్లిలో బీజేపీ మహాధర్నా సన్నాహక సమావేశం..

### సన్నాహక,సమావేశానికి హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లి మాధవి..



**మేడ్చల్, అక్షిత బ్యూరో :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ మరియు కాంగ్రెస్ పార్టీ ఫైఫల్యాలను ఎండగడుతూ, భారతీయ జనతా పార్టీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ఈ ఆదివారం ఇందిరాపార్క్ కేంద్రంగా నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమం



దిగ్విజయం చేయాలనే సంకల్పంతో, శుక్రవారం అసెంబ్లీ స్థాయి సన్నాహక సమావేశం..కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కొంపల్లిలో ఏర్పాటు చేశారు.కొంపల్లి బీజేపీ అధ్యక్షులు సతీష్ సాగర్ ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి జిల్లా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యి నాయకులకు దేశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నందనం దివాకర్, అరకల సుధ, జిల్లా నాయకులు ఆదిరెడ్డి రాజిరెడ్డి, బక్క శంకర్ రెడ్డి, గిరివర్ధన్ రెడ్డి, విఘ్నేశ్వర చారి, జనార్ధన్ రెడ్డి, భరత్ సింహ్ రెడ్డి, నాయకులు రఘుపతి, సుమన్ రావు, అశోక్, గరిగె శేఖర్, భాను చందర్, శ్యామ్ కిరణ్, కొంపల్లి నాయకులు జీవన్ రెడ్డి, నరసింహా, చక్రధర్, దుర్గా, నర్సింగ్ రావు, డివిజన్ అధ్యక్షులు కట్ట కుమార్, విజేందర్, రాజు, వాసు, పద్మ ప్రసాద్, మణికంఠ, నరేంద్ర చౌదరి, ప్రసాద్ రాజు, బిక్షపతి యాదవ్, రాజేష్ చారి తదితరులు పాల్గొన్నారు..

# కాళోజి హెల్త్ యూనివర్సిటీ ఇన్చార్జి వీసీ గా రమేష్ రెడ్డి



**వరంగల్, అక్షిత బ్యూరో:** కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ అండ్ సైన్సెస్ ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ గా భువనగిరి యాదాద్రి జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేస్తున్న కే రమేష్ రెడ్డిని నియమిస్తూ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ద్వారా ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి. గతంలో పనిచేసిన వైస్ ఛాన్సలర్ రాజీనామా చేసిన విషయం విధితమే తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు కాళోజీ నారాయణరావు హెల్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఇన్చార్జ్ వైస్ ఛాన్సలర్గా రమేష్ రెడ్డి కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తరలో పేర్కొంది.

# చెరువు మాదారం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

### కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి యడవల్లి శ్రీను



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో మేజర్ గ్రామపంచాయతీ చెరువు మాదారంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి యడవల్లి శ్రీను బరిలో ఉన్నారు. తనకు గ్రామ ప్రజలు సర్పంచ్ గా అవకాశం ఇస్తే చెరువు మాదారం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు తో పాటు మినీ స్టేడియం అందుబాటులోకి తెస్తానని తెలిపారు.చెరువు మాదారం గ్రామాన్ని అన్ని రంగాలలో ముందు ఉంచుతానని ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తానని చెరువు మాదారంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనదే విజయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు విలువలతో కూడినవిద్యఅవసరం:విద్యావేత్త లక్కినేని ప్రసాద్

### ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలు అందజేత



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** ప్రఖ్యాతిగాంచిన భారతీయ సంస్కృతి, గొప్పతనం, భారత ప్రముఖుల చరిత్ర, మానవతా విలువలతో కూడిన ప్రముఖుల పుస్తకాలను ప్రముఖ విద్యావేత్త లక్కినేని ప్రసాద్ శుక్రవారం సత్తుపల్లి డివిజన్ లోని పాఠశాలల వారికి అందజేశారు. పాఠశాలలకు అందజేసిన ఒక్కో బండిల్స్ లో 100 వరకు పుస్తకాలు ఉన్నాయి. భారతదేశ చరిత్రకు వన్నెతెచ్చిన మహనీయుల జీవితాలను సరళమైన భాషలో నేటి తరానికి తెలపడానికి ఈ పుస్తకాలు దోహదపడతాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వీర వనిత రాణి రుద్రమదేవి, వేయి పడగలు అనే 1000 పేజీల నవలా రచయిత విశ్వనాథ సత్యనారాయణ, స్వాతంత్ర్యం నా జన్మ హక్కు అని చాటిన లోకమాన్య బాలగంగాధర్ తిలక్, భారతదేశపు ఉక్కుమనిషి స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ పటేల్, దేశంలో విద్యాభివృద్ధికి కృషి చేసిన జ్యోతిరావు పూలే, బాల్య వివాహాల నిర్మూలన చేసిన కందుకూరి వీరేశలింగం, విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలు, ఋషి పుంగవులు రమణ మహర్షి, భారత స్వాతంత్ర సాధన కోసం పోరాడిన విప్లవ వీరుడు వీర సవర్కర్, బ్రిటిష్ వారిపై పోరాటంలో 19 వీర మరణం పొందిన కుదిరంబోస్, చత్రపతి శివాజీ, అశోకుడు, చాణక్య, స్వామి రామానంద తీర్థ, బాలగంగాధర్ తిలక్ తదితర 60 మంది జీవిత చరిత్రలతో కూడిన పుస్తకాలతో పాటు భారతంలో చిన్న కథలు, మన వారసత్వం, మన ఆరోగ్యం మన చేతుల్లో, వేమన శతకం, కృష్ణ శతకం, సుమతి శతకం, భాస్కర శతకం, ఉజ్వల వైజ్ఞానిక పరంపర, 108 నిజాలతో కూడిన భారతీయ ప్రతిభ విశేషాలు తదితర పుస్తకాల పుస్తకాలతో కూడిన కిట్టును అందజేశారు. ఇవి విద్యార్థులకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

# కాకర్లపల్లి బరిలో కాంగ్రెస్ టిడిపి బలపర్చిన కూటమి సర్పంచ్ ఉప సర్పంచ్ అభ్యర్థులు



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి మండలం కాకర్లపల్లి పంచాయతీ లో కాంగ్రెస్ పార్టీ మరియు తెలుగుదేశం పార్టీ పొత్తు నేపథ్యంలో కాకర్లపల్లి పంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి చల్లారి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పమ్మి రాము మరియు వార్డ్ నెంబర్స్ నామినేషన్ కార్యక్రమం జరిగింది.భారీ ర్యాలీ లో పాల్గొన్నారు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ . ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ని, తెలుగుదేశం పార్టీ ఉప సర్పంచ్ అభ్యర్థి ని భారీ మెజారిటీ తో గెలిపించాలి అని కాకర్లపల్లి ప్రజలను కోరారు డాక్టర్ మట్టా దయానంద్ . ఈ కార్యక్రమం లో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్,సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివా వేణు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహా రావు,కాకర్లపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు...

# బిఆర్ఎస్ వార్డు అభ్యర్థి సిపిఎంలో చేరిక



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** ప్రజలకు కోసం పనిచేసే నాయకులకు ప్రజలు అండగా నిలువాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ కోరారు. శుక్రవారం మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు గ్రామంలో బిఆర్ఎస్ వార్డు అభ్యర్థి ఇద్దేబోయిన వెంకన్న శుక్రవారం సిపిఎం పార్టీలో చేరగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం చేస్తున్న ప్రజా ఉద్యమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు చౌగాని సీతారాములు, మండల నాయకులు చౌగాని వెంకన్న, నాగయ్య, నరసింహులు, సోమయ్య, సోమయ్య, చితకల సువార్త, శేఖర్ గుండు నాగయ్య, వెంకటయ్య, చౌగాని లింగయ్య, రామయ్య, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక



# పెన్షనర్ల లైవ్ సర్టిఫికెట్ నమోదు కేంద్రాల ప్రారంభం

**ఖమ్మం/అక్షిత బ్యూరో :** పెన్షనర్ల జీవన ప్రమాణ పత్రాలను ఆన్లైన్లో పంపించే ప్రక్రియను ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేడు ఖమ్మం నగరంలోని నాలుగు ప్రాంతాలలో ఉచిత సేవా కేంద్రాలను ప్రారంభించింది. పెన్షనర్ల ఉచిత సేవా కేంద్రాలను ప్రారంభిస్తూ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులంతా ప్రతి సంవత్సరం ఆన్లైన్ లో మొబైల్ ఫోన్ ద్వారా పెన్షనర్లు జీవించి ఉన్నారన్న సర్టిఫికెట్ను ప్రతి సంవత్సరం నవంబర్ నెల నుండి మార్చి నెల వరకు పంపవలసి ఉంది. ఈ సందర్భంగా లైఫ్ సర్టిఫికెట్ పంపించే ప్రక్రియలో సమస్యలు ఉన్నందున జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఉచిత సహాయ కేంద్రాలను







ఏర్పాటు చేసింది. ఖమ్మం నగరంలోని వన్ టౌన్ యూనిట్ పరిధిలో గల ముస్తఫా నగర్ శ్రీరామ్ నగర్ రెండవ పట్టణ ప్రాంతమైన రాపర్తి నగర్ మూడవ పట్టణ ప్రాంతంలోని గాంధీ చౌక్ లోని గాంధీ పార్కు వద్ద మరియు రోటరీ నగర్ యూనిట్ పరిధిలోని రోటరీ నగర్ ప్రాంతంలో ఉచిత సేవా కేంద్రాలను ప్రారంభించిందని ఈ కేంద్రాలను పెన్షనర్లందరూ వినియోగించుకోవాలని తెలిపారు. అనారోగ్యంగా ఉండి వయసు 80 సంవత్సరములకు పైబడిన పెన్షనర్లు తమ ఇంటి నుండే ఆండ్రాయిడ్ ఫోన్ల ద్వారా సబ్ ట్రెజరీ కార్యాలయం లోని అధికారులతో వాట్సఅప్ కాల్ ద్వారా సమర్పించే అవకాశం ఉన్నదని దీనికి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. మార్చి 2026 లోగా పెన్షనర్లందరూ పెన్షన్ పొందుటకు తాము జీవించి ఉన్నట్లుగా ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా ఇవ్వవలసి ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి రాయల వెంకటనారాయణ తో పాటు నగర శాఖల బాధ్యులైన దొడ్డ రమేష్ బానోత్ వెంకటేశ్వర్లు శంకర్ మల్లెల శంకర్రావు జి ఆదినారాయణ సిహెచ్ బాబు సత్యనారాయణ మురళి డీకే శర్మ ఆర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క అవకాశం ఇస్తే తిరుమలాపురం గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

**బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి కమ్మదన ప్రవీణ్**



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం తిరుమలాపురం గ్రామం బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా కమ్మదన ప్రవీణ్ బరిలో ఉన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గ్రామ ప్రజలు సర్పంచ్ గా ఒక్క అవకాశం ఇస్తే తిరుమల పురం గ్రామాన్ని తీర్చి దిద్దుతానని తెలిపారు.గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందిస్తానని ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేకూరేలా కృషి చేస్తానని గ్రామంలో అన్ని రోడ్లు సిసి రోడ్లుగా మారుస్తానని గ్రామంలో పార్కును అభివృద్ధి చేస్తానని తెలిపారు.

## బుగ్గపాడు సర్పంచ్ అభ్యర్థిగా బొడ్డు రోజా లక్ష్మి నామినేషన్



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థినిగా బొడ్డు రోజా లక్ష్మి శుక్రవారం నామినేషన్ వేశారు.బుగ్గపాడు పంచాయితీ సర్పంచ్ రిజర్వేషన్ రోస్టర్ విధానంలో ఓసి జనరల్ మహిళకు కేటాయించడంతో దివంగత బొడ్డు వెంకటేశ్వరరావు చిన్న కుమారుడు బొడ్డు శివబాబు సతీమణి బొడ్డు రోజా లక్ష్మి బిఆర్ ఎస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థినిగా పోటీ చేస్తున్నారు.చంద్రాయపాలెం, గాంధీనగర్, నేపాల్ కాలనీ లతో ఉన్న బుగ్గపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నిక ఈసారి సర్పంచ్ ఓసి జనరల్ మహిళకు కేటాయించడంతో రసవత్తర పోరుకు సత్తుపల్లి మండలంలోనే ప్రత్యేకంగా నిలవబోతుంది.ఈ కార్యక్రమంలో తుమ్మూరు ప్రసాద్ బాబు, బొడ్డు శివ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలదారులకు స్టీల్ ప్లేట్లు బహుకరణ



**కోదాడ అక్షిత ప్రతినిధి:** చిలుకూరు మండలం ఆర్లగూడెం గ్రామంలో అయ్యప్ప మాల ధరించిన స్వాములకు దాత కన్నె కంటి నాగరాజు 50 స్టీల్ ప్లేట్లను స్వాములకు ఉచితంగా బహుకరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల భయంకరమైన క్యాన్సర్ లాంటి రకరకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయని ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని అయ్యప్ప మాల ధరించిన స్వాములు ప్రతిరోజు ప్లాస్టిక్ ప్లేట్లలో గ్లాసులలో భోజనం చేయడం వలన వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున స్వాములకు భోజనం ప్లేట్లను బహుకరిస్తున్నట్టు తెలిపారు ప్రతి ఒక్కరు బాధ్యతగా ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో కొట్టం శ్రీనివాస్ సాగర్ల నాగేశ్వరరావు గంటం వాసు పర్యావరణ పరిరక్షకుడు కొల్లు లక్ష్మీనారాయణ తదితర స్వాములు పాల్గొన్నారు.

## పుట్టిన ఊరికి సేవ చేసే అవకాశం ఇవ్వండి

**బోగారం బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి కునూరు సాయి కుమార్ గౌడ్**





**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట మండలం బోగారం గ్రామంలో రెండో విడత సర్పంచ్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ వేడి చోటు చేసుకుంది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా కూనూరు సాయి కుమార్ గౌడ్ బరిలో నిలుస్తున్నారు. గ్రామ అభివృద్ధి పట్ల ఉన్న ప్రేమ, ప్రజల సమస్యల పట్ల ఉన్న నిబద్ధతే తనను ఎన్నికల రణరంగంలోకి తెచ్చిందని ఆయన పేర్కొన్నారు. బోగారం గ్రామంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఇంటింటి ప్రచారం మ్మొదలు పెట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి మాట్లాడుతూ పేదలను ఆదుకోవడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటానని, ఎవరికి ఏ కష్టం వచ్చిన ఏ సమయంలోనైనా నేను అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.సాయికుమార్ అభ్యర్థిత్వానికి మరింత బలం చేకూర్చేందుకు మాజీ సర్పంచ్ పద్మ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామమంతా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఓటరి ఇంటికి చేరుకొని సాయికుమార్ ఇప్పటి వరకు చేసిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తులో అమలు చేయబోయే పథకాల గురించి వార్డు వార్డు తిరుగుతూ ప్రజలకు వివరించారు.

## వంగాల బాలనర్సయ్య గౌడ్ సేవలు చిరస్మరణీయం

**వర్ధంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పైల్ల శేఖర్ రెడ్డి**



**వలిగొండ/ అక్షిత న్యూస్:** వంగాల బాల నర్సయ్య గౌడ్ సేవలు చిరస్మరణీయమని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైల్ల శేఖర్ రెడ్డి అన్నారు.వలిగొండ మండల పరిధిలోని నెమలి కాల్వ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వంగాల బాల నర్సయ్య గౌడ్ 15వ వర్ధంతి వేడుకలను కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ళశేఖర్ రెడ్డి హాజరై బాల నర్సయ్య గౌడ్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగాల బాల నర్సయ్య గౌడ్ గ్రామానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఆయన వెంట కుటుంబ సభ్యులు వంగాల వెంకన్న, పైల రాజా వర్ధన్ రెడ్డి,వంగాల రోహిత్ గౌడ్, మండల అధ్యక్షుడు తుమ్మల వెంకటరెడ్డి, మాజీ జెడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్, పనుమటి మమత, ముద్దసాని కిరణ్ రెడ్డి, మాజీ సర్పంచి వంగాల బిక్షపతి,పిఎ సి ఎస్ చైర్మన్, బందేల రమేష్ రేగు మల్లేష్ నిడిగొండ వెంకటేష్ వంగాల ఆంజనేయులు, రాజు మురళి సత్యనారాయణ, కాసుల కృష్ణ,వాసుదేవ్ గౌడ్, కాసుల వెంకన్న గౌడ్, ఎండి సలీం, మరియు ఆయన అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పంచాయతీ ఎన్నికలు

### తొలివిడత ఎన్నికలు జరిగే మండలాల్లో 8న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సజావుగా చేపట్టాలి

### జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి



**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** మొదటి విడత ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేసుకోవాలని జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మొదటి విడత ఎన్నికలు జరిగే గోపాల్పేట, రేవల్లి మండలాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు.తుది జాబితాలో నిలిచిన పోటీ చేసే అభ్యర్థులకు వారికి కేటాయించిన గుర్తులను తెలియచేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. 8వ తేదీన పోలింగ్ సిబ్బందికి మండల కార్యాలయాల్లో నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఎంపీడీఓకు అవగాహన కల్పించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే పోలింగ్ సిబ్బంది నుండి ఫారం 17, డ్యూటీ ఆర్డర్ కాపీ చూసి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ వెనకాల ఖచ్చితంగా రిటర్నింగ్ అధికారి సంతకం ఉండాలని లేనిపక్షంలో ఓటు చెల్లదన్నారు. సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ పోస్ట్ చేశారా? ఎంతమంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని పరిశీలించారు. సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ పంపిస్తే ఓటరు జాబితాలో పోస్టల్ బ్యాలెట్ జారీచేసినట్లు మార్క్ చేశారా లేదా అని తనిఖీ చేశారు. డిసెంబర్ 11న నిర్వహించనున్న ఎన్నికల ఏర్పాట్లపై అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్సులు, మెటీరియల్ పంపిణీ కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన వసతులు, పోలింగ్ సిబ్బందికి భోజన ఏర్పాట్లు, రూట్ వారిగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అప్రమత్తం చేశారు. ఎన్నికలు పూర్తి అయి ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచి ఎంపిక, తిరిగి బ్యాలెట్ బాక్సులు రిసెప్షన్ సెంటర్ లో అప్పగించే వరకు కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గోపాల్పేట ఎంపీడీఓ డా. ఆయేషా అంజుం, తహసిల్దార్ తిలక్ రెడ్డి, రేవల్లి ఎంపీడీవో ఎ. కీర్తన, తహసిల్దార్ లక్ష్మీ, ఎంపీఓ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## పిడిఎస్ యు జిల్లా, రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ




**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) నల్లగొండ జిల్లా 23వ మహాసభ ఈనెల 9న నల్లగొండ జిల్లా కేంద్రంలోని శ్రామిక భవన్ లో, రాష్ట్ర మహాసభలు జనవరి 5, 6, 7న వరంగల్ లో నిర్వహిస్తున్నామని ఈ మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిడిఎస్ యు జిల్లా ఇంచార్జి ఇందూరు సాగర్ పిలుపునిచ్చారు.

మిర్యాలగూడ పట్టణం ఈదులగూడలో పిడిఎస్ యు మహాసభల పోస్టర్లను ఆయన ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ పిడిఎస్ యు విద్యార్థి సమస్యల పరిష్కారం కై అహర్నిశలు కొట్లాడుతుందన్నారు. రాష్ట్రంలో 1972లో ఉస్మానియా యూనివర్సిటీలో జార్జిరెడ్డి నాయకత్వంలో ఆవిర్భావం జరిగిందని నాటి నుండి నేటి వరకు విద్యార్థి హక్కుల కోసం, సామాజిక, రాజకీయ పరిణామాలు పై అలుపెరుగనిపోరాటం చేస్తుందన్నారు. అనేక నిర్భందాలు, అరెస్టులు, చిత్రహింసలను ఎదుర్కొని మొక్కవోణీ దైర్యంతో బలమైన సంస్థగా నిర్మాణం చెందిందన్నారు. జేసీఎస్ ప్రసాద్, శ్రీహరి, రంగవల్లి, సాంబయ్య, వరహాలు, కోలా శంకర్, మారోజు వీరన్న, రంగవల్లి లాంటి అనేక మందిని రాజ్యం, కిరాయి గుండాలచే హత్య చేయబడినా పిడిఎస్ యు నిర్మాణం ఆగలేదన్నారు. 50 ఏండ్ల పిడిఎస్ యు ఉద్యమ ప్రస్థానంలో అనేక విజయాలను సాధించిందన్నారు. గత ఉద్యమాలను సమీక్షించుకోని భవిష్యత్ పోరాట కర్తవ్యాలను రూపొదించుకోవడానికి మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి పోలె పవన్, నాయకులు ఐ.లోకేష్, వెంకటేష్, హరీష్, సిద్ధు, కామళ్ళ సంజయ్, ప్రవీణ్, వి. రాజు, స్వామి, కిరన్, ప్రణయ్ పాల్గొన్నారు.

## మంత్రి రాజనర్సింహ జన్మదిన వేడుకలు

### ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి



**నారాయణఖేడ్, అక్షిత ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలోని జోగిపేట్ పట్టణంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జన్మదిన వేడుకల్లో నారాయణఖేడ్ నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ పి సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పి చంద్రశేఖర్ రెడ్డి, ఉజ్వల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి తదితర ముఖ్య నాయకులతో కలిసి పాల్గొన్నారు.మంత్రిను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే ,శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## సత్తుపల్లి క్యాంప్ కార్యాలయంలో

# కాంగ్రెస్ నాయకుల ప్రెస్‌మీట్

### గ్రామపంచాయతీ ఎన్నికలపై రాజకీయ వేడి

### పార్టీకి రాష్ట్ర పదవి అనుభవిస్తున్న నాయకుడు వెన్నుపోటు



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రోజు పార్టీ సీనియర్ నాయకులు అత్యవసరంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారికంగా పోటీ చేసే అభ్యర్థుల జాబితాను పార్టీ విడుదల చేసింది.

అయితే ఈ ప్రెస్ మీట్ లో ఒక సీనియర్ రాష్ట్ర స్థాయి పదవి అనుభవిస్తున్న నాయకుడిపై "పార్టీకి వెన్నుపోటు" అంటూ వచ్చిన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**కాంగ్రెస్ లో కలకలం-భగ్గుమన్న విభేదాలు**

పార్టీ నేతలు స్పష్టం చేసినట్టు, "పార్టీలో ఉండి%ొ% పార్టీకి బలహీనత కలిగించే ప్రయత్నాలు చేయడం అసహ్యం" అని వ్యాఖ్యానించారు.

**వార్తలు చెబుతున్న ప్రకారం**

రాష్ట్ర స్థాయి పదవిలో ఉన్న ఓ నాయకుడు, అధికారిక అభ్యర్థుల జాబితా విడుదలకు ముందు నుంచి రెబెల్ అభ్యర్థులను ప్రోత్సహిస్తూ, లోపల నుంచే పార్టీని బలహీనపరుస్తున్నాడనే ఆరోపణలు వెలువడ్డాయి.

"రాబోయే కాలంలో ఆ నాయకుడు కింద స్థాయి పదవికైనా పనికిరాడు" అంటూ మండిపడ్డ నాయకులు ప్రెస్ మీట్ లో నాయకులు అసహనం వ్యక్తం చేస్తూ,"ఇప్పుడు రాష్ట్ర పదవి అనుభవిస్తున్న ఆ నాయకుడు పార్టీకి నిబద్ధత చూపకపోతే రాబోయే కాలంలో కింద స్థాయి నాయకుడికి కూడా తగని పరిస్థితి వస్తుంది. పార్టీకి ద్రోహం చేసే వారికి కాంగ్రెస్ లో స్థానం లేదు" అని స్పష్టం చేశారు.

**పంచాయతీ ఎన్నికలలో రిబెల్స్ బెడద**

గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే, కొంతమంది అసంతృప్త నేతలు స్వతంత్రులుగా బరిలోకి దిగి ఓటు విభజనకు కారణం కావడం పార్టీకి ఆందోళన కలిగిస్తోంది.ఈ రెబెల్ అభ్యర్థులకు పైన చెప్పిన నాయకుడే మద్దతు ఇస్తున్నాడనే ఆరోపణలే ఇప్పుడు వేడెక్కిన రాజకీయాలకి కారణం.

**"పార్టీ నిర్ణయమే అంతిమం-విభేదాలు సహించం"**

ప్రెస్ మీట్ ముగింపులో నాయకులు స్పష్టం చేశారు. "సత్తుపల్లి కాంగ్రెస్ బలమైన కేడర్ ఉన్న నియోజకవర్గం. వ్యక్తిగత ఆశలు కాదు, పార్టీ నిర్ణయం ముఖ్యం. పార్టీకి వ్యతిరేకంగా వెళ్లేవారిపై కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు.

## ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తా

### సర్పంచ్ అభ్యర్థి డాక్టర్ రాపోలు సహజ



**వలిగొండ /అక్షిత న్యూస్:** తనను ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని వలిగొండ మండలం దాసిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి డాక్టర్ రాపోలు సహజ అన్నారు. కాంగ్రెస్ బిజెపి పార్టీలు బలపరిచిన అభ్యర్థి సహజ శుక్రవారం పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి, ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తానని అన్నారు. అదేవిధంగా గ్రామంలో కోతుల బెదడ అధికంగా ఉన్నందున తాను గెలవగానే కోతులను గ్రామంలో లేకుండా పట్టిస్తానని అన్నారు. అలాగే భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయిస్తానని, ఇంకా రేషన్ కార్డులు లేనివారికి రేషన్ కార్డులు, పెన్షన్లు, రోడ్లు లేని కాడ సిసి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ సౌకర్యాన్ని చేపడుతానని సహజ అన్నారు. విద్యావంతురాలు నైన నన్ను ఆశీర్వదించి గెలిపించాలని ఎలాంటి అవినీతికి తావు లేకుండా అభివృద్ధి చేస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బిజెపి పార్టీ నాయకులు పాలు రాజయ్య, గోదా అచ్చయ్య గౌడ్, బందారపు రాములు గౌడ్, దేవరపల్లి భూపాల్ రెడ్డి, రావుల పద్మా రెడ్డి, దంతూరి పరమేష్ గౌడ్, పాశంసత్తిరెడ్డి, కొమురెల్లి ప్రవీణ్ రెడ్డి, రాపోలు అనిల్, సునీల్, కోనపురి లింగస్వామి, నాగేష్, బాలగోని సూరి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సిఈగా సుమతి దేవి బాధ్యతలు



**నిజామాబాద్, అక్షిత ప్రతినిధి :** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మెండోర మండలంలోని పోచంపాడు గ్రామ శివారులో గల శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ నూతన ముఖ్య ఇంజనీరింగ్ (సిఈ ) గా సుమతి దేవి అదనపు బాధ్యతలు శ్రీరామ్ ప్రాజెక్ట్ ప్రధాన ఇంజనీరింగ్ అధికారిగా ప్రధాన ఇంజనీరింగ్ అధికారిగా శుక్రవారం రోజున బాధ్యతలు స్వీకరించారు. గత సుమారు రెండు దశాబ్దాలుగా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు సీఈగా, ఎన్నో ఇంజనీర్ విభాగంలో పలువులు చేపట్టి, ఇటీవలే పదవి విరమణ పొందారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు సీఈగా విధులు నిర్వర్తించిన సుధాకర్ రెడ్డి పదవి విరమణ చేయడంతో, ఆ అధికారి స్థానంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ముఖ్య ఇంజనీరింగ్ గా సుమతీదేవి బాధ్యతలు స్వీకరించారు. సుమతి దేవి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన నీటిపారుదల శాఖ డిఈఈ, ఏఈలు, ఎస్ ఈ, శ్రీరామ్ సాగర్ కు చెందిన అధికారులు, లస్కర్లు, సిబ్బంది పలువురు సుమతి దేవి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, స్వాగతించి అభినందనలు తెలియజేశారు. ప్రాజెక్టు ప్రధాన అధికారిగా బాధ్యతలు చేపట్టిన సుమతీదేవి శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టును సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతతో ఆర్థిక పరిపుష్టి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** మహిళా సాధికారతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని మహబూబ్‌నగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో గృహిణులు, అవివాహిత మహిళలకు ఎమ్మెల్యే తన స్వంత నిధులతో ఉచితంగా అందిస్తున్న నైపుణ్య శిక్షణకు సంబంధించిన మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత మూడు బ్యాచ్‌లలో శిక్షణ పొందిన సుమారు 1000 మంది మహిళలు తమ తమ రంగాల్లో స్థిరపడటం మహబూబ్‌నగర్‌లో మహిళా ఆత్మవిశ్వాసానికి నిదర్శనమన్నారు. ఈ మహిళలు స్వయం ఉపాధి



అవకాశాలను మాత్రమే పొందలేదు, ఇతరులకు ఉపాధి కల్పిస్తూ స్థానిక ఆర్థిక వ్యవస్థలో కొత్త ప్రేరణగా మారారు అని చెప్పారు. "మహిళలను ఆర్థికంగా బలపరచడం తన సంకల్పం అని ఆయన స్పష్టం చేశారు. మహిళా శక్తి బలపడితే మహబూబ్‌నగర్ బలపడుతుందన్నారు. శిక్షణ, నైపుణ్యం, ఉపాధి ఇవి మూడు కలిసి వారి జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకొస్తాయి." అని ఆయన చెప్పారు. మహబూబ్‌నగర్ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు, వచ్చే 10 ఏళ్లలో 20 వేల మందికి నైపుణ్య శిక్షణ అందించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆయన వివరించారు. అలాగే మహిళలు స్వయం సమృద్ధిగా మారడం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి, నగర అభివృద్ధి, సమాజ ప్రగతి ఏకకాలంలో ముందుకు సాగుతాయని ఆయన పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ మహిళల కోసం చేపడుతున్న ఈ కార్యక్రమాలు సమాజ మార్పుకు, మహిళా అభివృద్ధి ఉదాహరణగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, ఎమ్మెల్యే పిఎ అనిల్, మహబూబ్‌నగర్ ఫస్ట్ ఇంచార్జీ నిజలింగప్ప , మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ప్రశాంత్, అంజద్, స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిలో చేరిన నెహ్రూకు కాంగ్రెస్ భారీ షాక్

### లక్ష్మాపురం కాంగ్రెస్‌లో క్రమశిక్షణ కుదుపు

### డిసిసి ఎమ్మెల్యే ఆదేశాలపై మండల గ్రామ కమిటీలు కఠిన నిర్ణయం



**నాగారం అక్షిత న్యూస్ :** మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలోని స్థానిక సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా పెద్ద పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బిజెపి తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జి కడియం రామచంద్రయ్య ఆధ్వర్యంలో ఇటీవల బీజేపీలో చేరిన జాటోత్ నెహ్రూ వ్యవహారం కాంగ్రెస్ లో క్రమశిక్షణ చర్యలకు దారితీస్తూ, గ్రామ రాజకీయ వాతావరణాన్ని పూర్తిగా మార్చేసింది. ఈ విషయమై జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో కాంగ్రెస్ అధినేతలు తీసుకున్న కఠిన నిర్ణయాలను గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గండెల ఉపేందర్ అధికారికంగా వెల్లడించారు. జాటోత్ నెహ్రూ బిజెపిలో చేరడమే కాకుండా, స్థానిక స్థాయిలో ప్రచారం చేస్తున్న సమయంలో, ఆయనకు మద్దతుగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్నట్లు పార్టీ హైకమాండ్ దృష్టికి చేరింది. ఈ ఆరోపణల నేపథ్యంలో, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయగా, వాటిని అనుసరించి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొడుసు లింగయ్య సూచనల మేరకు క్రమశిక్షణ చర్యలు చేపట్టే ప్రక్రియ ప్రారంభమైనట్లు గండెల ఉపేందర్ తెలిపారు. పార్టీని విడిచి ప్రత్యర్థి పార్టీలో చేరిన వ్యక్తి కోసం ప్రచారం చేయడం పార్టీ ఆత్మగౌరవానికి ముప్పు కలిగించే చర్యగా డీసీసీ అభిప్రాయపడగా, గ్రామంలో పార్టీ నిబద్ధతను కాపాడుకోవడానికి ఇలాంటి చర్యలు అవసరమని మండల నాయకత్వం స్పష్టం చేసింది. నెహ్రూ బిజెపి సర్పంచ్ అభ్యర్థిగా ప్రచారం చేస్తూనే, మరోవైపు బ్యాలెట్ పేపర్ లో స్వతంత్ర అభ్యర్థిగా పేరు నమోదు చేసుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చేసిన ప్రయత్నమని, ఇది ఎన్నికల పారదర్శకతకు విరుద్ధమని ఉపేందర్ ఆరోపించారు. నెహ్రూ రాజకీయ పందాలు ఈ అకస్మాత్ మార్పు గ్రామస్థాయిలో విస్తృతంగా చర్చనీయాంశం అవుతుండగా, ఆయనకు కాంగ్రెస్ లో మద్దతులిచ్చిన నాయకులు, కార్యకర్తలు కూడా ఇప్పుడు పార్టీ క్రమశిక్షణ చర్యలకు గురికా పోతున్నారని హెచ్చరికలు రావడం స్థానికంగా కొత్త ఆందోళనకు దారితీసింది. గ్రామస్థాయిలో ఒక్కరి నిర్ణయం మొత్తం పార్టీ ఇమేజ్ ని ప్రభావితం చేయకూడదనే ఉద్దేశంతో, పార్టీ నేతలు కఠినమైన రీతిలో నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

సర్పంచ్ ఎన్నికల బరిలోకి నెహ్రూ బిజెపి తరపున దిగిన, ప్రజల్లో గందరగోళం కలిగించేలా స్వతంత్ర అభ్యర్థిగా పేరు నమోదు చేసుకోవడం ఆయన నిజమైన లక్ష్యాలపై అనుమానాలను పెంచుతుంది. దీనికి తోడు ఆయన కోసం ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై సస్పెన్షన్ చర్యలు చేపడతామని అధికారికంగా వెల్లడించడం తెలిసింది. మొత్తం మీద, లక్ష్మాపురం గ్రామ కాంగ్రెస్ లో నెహ్రూ ప్రవేశంతో మొదలైన శాంతి భంగం ఇప్పుడు క్రమశిక్షణ అనే పేరుతో పెద్ద ఎత్తున మార్పులకు దారితీస్తూ స్థానిక ఎన్నికలను మరింత ఉద్రిక్తతతో నింపింది. ఎన్నికల రోజులు దగ్గర పడుతుండగా వీరి నిర్ణయాలు గ్రామ రాజకీయ సమీకరణాలలో ఎలాంటి ప్రభావం చూపిస్తాయో వేచి చూడాల్సిందే.

# పాత-కొత్త కలయికతో కాంగ్రెస్ మరింత పటిష్టత

## మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి :** మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.సంజీవ్ ముదిరాజ్ ప్రమాణ స్వీకార మహోత్సవం జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నూతన అధ్యక్షుడిని అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పాత నాయకుల అనుభవం, కొత్త నాయకుల ఉత్సాహం కలిసినప్పుడే ఏ పార్టీ అయినా వృద్ధి సాధిస్తుందని, మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ విస్తరణకు ఇదే సరైన సమయమని, అందరూ కలిసికట్టుగా పనిచేసి క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని" సూచించారు. జిల్లాలో ఉన్న ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు కొత్త అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందనే విశ్వాసాన్ని ఎమ్మెల్యే వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయపథంలో అడుగులు వేయాలంటే సమష్టి



కృషి అవసరమని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి నాయకత్వం వచ్చాకే పార్టీ బలపడ్డ తీరును ఆయన ఈ సందర్భంగా గుర్తుకు చేశారు. అలాగే మాజీ డిసిసి అధ్యక్షులు జి.మధుసూదన్ రెడ్డి గత మూడు సంవత్సరాలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉండగా, పార్టీని నిలబెట్టడంలో పోషించిన పాత్ర చాలా కీలకం అని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా మాజీ డిసిసి అధ్యక్షులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కొత్త వారికీ అవకాశాలు ఇవ్వడంతో పాటు పాత నాయకులకు గౌరవం తప్పనిసరిగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో నూతన డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ డిసిసి అధ్యక్షులుగా పదవీ బాధ్యతలు స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు, ఎఐసిసి ప్రత్యేక ఆహ్వానితులు డా. చల్లా వంశీచంద్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు మరియు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జి గోనెల శ్రీనివాసులు, టీపిసిసి ప్రతినిధి జహీర్ అక్తర్, సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్.పీ. వెంకటేష్, మారేపల్లి సురేందర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధా అమర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, వేముల కృష్ణయ్య, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్, ఎస్సీ సెల్ చైర్మన్ సాయిబాబా, ఐఎన్టీయుసి రాములు యాదవ్, గోపాల్ యాదవ్, అజ్మత్ అలి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, హన్వాడ మండల అధ్యక్షుడు వి.మహేందర్, చెన్నయ్య , హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు నవనీత, శారద, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రామచంద్రయ్య, ప్రవీణ్ కుమార్, మాధవరెడ్డి, ఫయాజ్, తాహేర్, అనుప ఆంజనేయులు, యాదిరెడ్డి, రఘు దాసరి, జె.వెంకటయ్య, జేసిఆర్, అబ్దుల్ హక్, మోయిాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల అప్పీల్ కేసు గెలిచిన సర్పంచ్ అభ్యర్థి ఇందిరా

## న్యాయవాది ఉయ్యాల నర్సయ్య




**కోదాడ అక్షిత ప్రతినిధి:** కోదాడ ఎన్నికల అప్పిలేట్ అధికారి ఇఆర్వో, ఆర్డీవో ముందు నామినేషన్ చెల్లుబాటు కాదనే ఇన్ వ్యాలుడ్ విషయంలో మునగాల మండలం నర్సింహులగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి కుంచం ఇందిరా గెలిచినట్లు ఆమె న్యాయవాది ఉయ్యాల నర్సయ్య తెలిపారు. మునగాల మండలం రేపాల క్లస్టర్ లోని నర్సింహులగూడెం గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి సీపీఎం బల పర్చిన అభ్యర్థి కుంచం ఇందిరా వైఫ్ ఆఫ్ నర్సయ్య ది.02-12-2025న హైకోర్టు ఉత్తర్వుల మేరకు నామినేషన్ దాఖలు చేశారు. ఆమె నామినేషన్ ను 3 వ తేదీన రేపాల క్లస్టర్ స్టేజ్1 ఎన్నికల అధికారి పరిశీలన చేసిన అనంతరం,ఆమె ఓటు సెప్టెంబర్ నెలలో నమోదు కాలేదని,తనకు ఇచ్చిన ఓటర్ లిస్టు నందు ఆమెకు ఓటు లేనందున ,ఆమె నామినేషన్ చెల్లుబాటు కాదని ప్రకటించారు. నామినేషన్ చెల్లదంటూ ప్రకటించిన రేపాల క్లస్టర్ ఎన్నికల అధికారి నిర్ణయం పై న్యాయవాది ఉయ్యాల నర్సయ్య కోదాడ ఎన్నికల అప్పిలేట్ అధికారి ఈఆర్వో, ఆర్డీవో ముందు ది.04-12-2025న అప్పీల్ వేసి,ఎన్నికల నోటిఫికేషన్ నాటికే ఆమె ఆ గ్రామంలో ఓటర్ గా నమోదు అయి ఉన్నారని,ఆమెకు పోటీ చేసే అర్హత ఉందని,హైకోర్టు అన్ని విషయాలు పరిగణనలోకి తీసుకునే ఆర్డర్ డబల్ యు పి నంబర్ ఇచ్చారని న్యాయవాది తన వాదనలు వినిపించారు.అప్పీల్ అధికారి సూర్యనారాయణ అన్ని అంశాలను పరిశీలించి, పై అధికారులు కలెక్టర్, ఎన్నికల కమిషనర్ లతో సంప్రదించి,చర్చించిన అనంతరం ఆమె నామినేషన్ చెల్లుబాటు అవుతుందని తీర్పునిచ్చారు.వెంటనే ఆమె నామినేషన్ చెల్లుబాటుకు చర్యలు తీసుకుంటూ,కుంచం ఇందిరా నర్సింహులగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి పోటీలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత మండల అధికారులను అదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.దీనితో కుంచం ఇందిరా ఆమె భర్త కుంచం నర్సయ్య ఆ గ్రామ సీపీఎం నాయకులు, సీపీఎం బలపర్చిన వార్డు మెంబర్ల అభ్యర్థులు అందరూ కలిసి ఎన్నికల అధికారులను కలిసి,ఆర్డర్ కాపీలను అందజేశారని లాయర్ తెలిపారు. కేసు గెలిపించిన ఉయ్యాల నర్సయ్య ను సీపీఎం నాయకులు గ్రామ ప్రజలు అభినందించారు.

# రాష్ట్రస్థాయి కోకో పోటీలకు బిసి గురుకుల విద్యార్థుల ఎంపిక



**నాగార్జునసాగర్, అక్షిత ప్రతినిధి :** నాగార్జునసాగర్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కోకో పోటీలకు ఎంపికైనట్లుగా ప్రిన్సిపల్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 7 తేదీలలో సికింద్రాబాద్ వెస్లీ బాయ్స్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 19 కోకో పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు అనిల్, అఖిల్ పదవ తరగతి విద్యార్థులు బన్నీ, నరేందర్ నల్లగొండ జిల్లా జట్టు తరుపున పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రవికుమార్ , వ్యాయామ ఉపాధ్యాయులు జ్యోతి, అరుణ, నరసింహ, ఉపాధ్యాయులు అభినందించారు.

# సర్పంచ్ బరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి


## ఊరికి మంచి చేయాలనే దృక్పథంతో రాజకీయాల్లో వచ్చానని వెల్లడి

## యువతకు ఆదర్శంగా నిలుస్తున్న లావణ్య రవీందర్ నాయక్



**హుస్నాబాద్ అక్షిత ప్రతినిధి:** హుస్నాబాద్ మండల పరిధిలోగల జిల్లల గడ్డ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలో సాఫ్ట్వేర్ ఉద్యోగి అయిన లావుడియా రవీందర్ నాయక్ బరిలో నిలిచారు శుక్రవారం తన అనుచరులతో పోతారం ఎస్ గ్రామపంచాయతీలో నామినేషన్ దాఖలు చేశారు అనంతరం రవీందర్ నాయక్ మాట్లాడుతూ సాఫ్ట్వేర్ ఉద్యోగి అయినప్పటికీ ఉన్న ఊరిని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లో వస్తున్నట్లు అన్నారు యువత రాజకీయాల్లో వచ్చి గ్రామ అభివృద్ధి కోసం పాటుపడతారని ఆకాంక్షతోటే నేను ప్రత్యక్ష రాజకీయాల్లో దిగి పోటీకి నిలబడ్డానని తెలిపారు జిల్లల గడ్డ నుండి పోతారం వరకు గిరిజన నాయకులతో భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు.

# పొనుగోడు గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా కటకం వేణు



**గరిడేపల్లి అక్షిత ప్రతినిధి:** గరిడేపల్లి మండలం కేంద్రంలోని పొనుగోడు గ్రామం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా కటకం వేణు నేడు నామినేషన్ వేశారు ఎన్నో సంవత్సరాల నుండి పార్టీలో పనిచేస్తూ తన ఫౌండేషన్ ద్వారా గ్రామంలో ఉన్నటువంటి పేద ప్రజలకు అండదండగా ఉంటూ సహాయ సహకారాలు అందించిన వ్యక్తి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయడం చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు ఇలాంటి వ్యక్తి సర్పంచ్ గా ఉండటం వలన గ్రామ అభివృద్ధి జరుగుతుందని గ్రామంలో ఉన్న ఓటర్లు వేణుని గెలిపించుకోవాలని కోరుకుంటున్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మరియు మాజీ ఎంపీపీ కటకం ఆషా రమేష్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నేలపట్ల వెంకటేశ్వర్లు హుజూర్నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నందిపాటి కోటయ్య జోగు అరవింద రెడ్డి వనపర్తి గురువయ్య కటకం గోపయ్య లక్ష్మీనారాయణ రెడ్డిపల్లి సైదులు పాపగంటి రాజయ్య చామకూరి శ్రీను కోడి మల్లయ్య చిలక పిచ్చయ్య మరియు గ్రామ ప్రజలు యువకులు మహిళలు పాల్గొన్నారు

## రాష్ట్ర కబడ్డీ పోటీలకు యాదాద్రి భువనగిరి జట్టు



**ఆలేరు/ అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నుండి మహబూబ్ గర్ జిల్లాలో డిసెంబర్ 5, 6, 7 వ తేదీలలో జరుగుతున్న 51వ జూనియర్ కబడి రాష్ట్రస్థాయి క్రీడలకు బయలుదేరుతున్న యాదాద్రి భువనగిరి జూనియర్ బాలల జట్టుకు స్థానిక రైల్వే స్టేషన్ లో పలువురు అతిథులు వీడ్కోలు పలికారు. ఇట్టి కార్యక్రమంలో మంద సోమరాజు, పరిగెల రాములు, రిటైర్డ్ జిల్లా రాష్ట్ర నాయకులు, చింతల సాయిబాబా, దిన శరణ్య, జానకిపురంలో కబ్బడి క్యాంపు నిర్వహించిన గ్రామ యువత నిర్వాహకులు సమ్మయ్య, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పూలచంద్ర కుమార్, రెఫ్రి మరాఠీ లింగ స్వామి, ఫ్రెండ్స్ క్లబ్ సభ్యుడు రాహుల్ తేజ, ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## భారీ ర్యాలీగా వెళ్ళి బోరంచ కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్



**నారాయణఖేడ్,అక్షిత ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లానారాయణఖేడ్ నియోజకవర్గంలో మానూర్ మండలంలోని బోరంచ గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు శుక్రవారం భారీ ర్యాలీ నడుమ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. బోరంచ గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో చేరిన కార్యకర్తలు, యువత, మహిళలు డప్పుల సందడి, నినాదాలతోఉత్సాహభరితంగా మానూర్ వరకు ర్యాలీ కొనసాగించారు. అనంతరం అభ్యర్థులు ఎన్నికల అధికారికి తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు బాజిరెడ్డి, యువ నాయకులు లోకేష్ రెడ్డి,గ్రామ కాంగ్రెస్ నాయకులు, స్థానిక అభిమానులు పాల్గొన్నారు.

## వంగరామయ్య పల్లె నుండి భూక్య రాజేశ్వరి తిరుపతి నాయక్

### మిర్జాపూర్ గ్రామం నుండి వేల్పుల సంపత్ నామినేషన్




**హుస్నాబాద్ అక్షిత ప్రతినిధి:** హుస్నాబాద్ మండల పరిధిలో గల పలు గ్రామాలలో నామినేషన్లు చివరి రోజు భారీగా నమోదు కావడం జరిగింది. నామినేషన్ల పర్వంలో భాగంగా వివిధ గ్రామపంచాయతీలను ఎస్పై పి లక్ష్మారెడ్డి సందర్శించి పర్యవేక్షించారు. హుస్నాబాద్ మండలం వంగరాయపల్లి. గ్రామపంచాయతీ నుండి భూక్య రాజేశ్వరి తిరుపతి నాయక్ గెలుపు ధీమాతో నామినేషన్ వేస్తున్నట్లు ప్రకటించారు అనంతరం మేజర్ గ్రామ పంచాయతీ అయిన మిర్జాపూర్ నుండి వేల్పుల సంపత్ తన నామినేషన్లను గ్రామపంచాయతీలో అధికారులకు అందజేశారు ఆశావాహులు తమ తమ విజయాలపై ధీమాలను వ్యక్తం పరుస్తూ గ్రామాల అభివృద్ధికి తోడ్పడతామని అన్నారు ఈ కార్యక్రమంలో భారీ ర్యాలీ తీసి నామినేషన్ కు బయలుదేరారు.

# ఈవీఎం గోదాముల తనిఖీ



### తనిఖీ చేసిన కలెక్టర్ స్నేహ శబరిష్

**హనుమకొండ, అక్షిత ప్రతినిధి:** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల ఈవీఎంల ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదనవు కలెక్టర్ వెంకట్ రెడ్డి తో కలసి శుక్రవారం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లాకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపర్చిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆర్డీఓ రాథోడ్ రమేష్, ఎన్నికల పర్యవేక్షకులు జగత్ సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ వి శ్రీనివాస్, శ్యామ్ సుందర్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ ప్రాచీన వైద్య విధానాలకు పూర్వవైభవం తథ్యం: ఆలే శ్యామ్ కుమార్..

### కొండాపూర్ రాజరాజేశ్వర నగర్లో ఆయుఃవృద్ధి వెల్నెస్ క్లినిక్ ప్రారంభోత్సవం..



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** భారత్ లో ప్రాచీన వైద్య విధానాలకు తిరిగి ఆదరణ లభిస్తుండటం శుభ సూచకమని అఖిల భారత ధర్మ జాగరణ సహ ప్రముఖ్ ఆలే శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. కొండాపూర్ రాజరాజేశ్వర నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుఃవృద్ధి హెూమియోపతిక్ అండ్ వెల్నెస్ క్లీనిక్ ని ఆయన లాంఛనంగా ప్రారంభించి, సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయుఃవృద్ధి వ్యవస్థాపకురాలు డాక్టర్ సింధు బైరవి, ఫైనాన్స్ డైరెక్టర్ మనోహరి, మ్యూజిక్ థెరపిస్ట్ వశిష్ట రామ్, సలహాదారులు చింతకింది గోవర్ధన్ గౌడ్ లను ఆలె శ్యామ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. శేరిలింగంపల్లి ప్రాంత వాసులకు అధునాతన హెూమియోపతి సేవలతో పాటు న్యూట్రిషనల్, యోగ, మ్యూజిక్ థెరపిలను అందుబాటులోకి తీసుకురావడం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఒకవేళ అనారోగ్యం బారిన పడ్డప్పుడు ప్రాథమిక దశలోనే ఆయుర్వేదం, హెూమియోపతి లాంటి సాంప్రదాయ వైద్యంను ఎంచుకోవాలని సూచించారు. భారతీయ జీవన విధానంలో ప్రాచీన వైద్య విధానాలు ఎన్నో అందుబాటులో ఉండేవని అందులో విశిష్టమైనది మ్యూజిక్ థెరపీ అని అన్నారు. రాగాలను ఉపయోగించి రోగాలను నయం చేసే ప్రాచీన పద్ధతి కాలక్రమంలో కనుమరుగైనప్పటికీ ఇటీవల మళ్లీ ప్రాధాన్యతను సంతరించుకోవడం గొప్ప విషయమని అన్నారు. కరోనా తర్వాత మన ప్రాచీన సాంప్రదాయ వైద్య విధానానికి తిరిగి ఆదరణ లభిస్తుండడం, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కడం మనకెంతో గర్వకారణమని అన్నారు. వెల్నెస్ సెంటర్ లోని వివిధ విభాగాలను అతిథులుగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్, ఎస్ బి ఐ రీటైర్డ్ ఏ జి ఎం బాల్ద అశోక్, యోగా శిక్షకులు, సీనియర్ జర్నలిస్ట్ పుట్ట వినయ్ కుమార్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త రాఘవేంద్రరావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజా, సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు హెూమియో వైద్య ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాయి ఆత్మహత్యకు ప్రభుత్వాలదే బాధ్యత



**హనుమకొండ అక్షిత ప్రతినిధి :** బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వరా చారి మరణానికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలని బిసి జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్ చేసినారు. గతంలో రిజర్వేషన్లు తగ్గిపోవటం ఇస్తామన్న 42 శాతం రిజర్వేషన్ల హామీ నెరవేరకపోగా బీసీ రిజర్వేషన్లు మరింత తగ్గిపోవడంతో బలహీన వర్గాలలో ముఖ్యంగా యువత కొంతమంది ఆందోళన చెందుతున్నదనే విషయం సాయి ఆత్మహత్యతో రుజువైందని అభిప్రాయపడినారు. ఒక్క రిజర్వేషన్ల విషయమే కాదు బీసీల అభివృద్ధి సంక్షేమం పట్ల కూడా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుతో బలహీన వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా తెలంగాణ రాదనే ఆందోళనతో 1200 మంది ఆత్మ బలిదానాలు చేసుకున్న సంఘటనలు మరువకముందే సాయి ఆత్మహత్య సంఘటన జరగటం బాధాకరం.బలహీనవర్గాలు తమ వెనుకబాటుతనంపై ప్రభుత్వాలపై ప్రజాస్వామ్యక పోరాటాలకు సిద్ధం కావాలి కానీ ఆత్మహత్యలు లాంటి చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేసినారు.బలహీన వర్గాలకి అవకాశాలు కల్పించే విషయంలో ప్రభుత్వాలు తమ వైఖరి మార్చుకోవాలని డాక్టర్ శేషు డిమాండ్ చేసినారు.